నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | NALGONDA

బడ్జెట్‌లో వ్యవ'సాయం' ఏది

కాంగ్రెస్ హామీ మేరకు రూ.82వేల కోట్లు అవసరం.. కేటాయింపులు రూ.16వేల కోట్లు

- ఆరు గ్యారెంటీలకు చట్టమన్నారు..ఆ ఊసే లేదు
- నిరుద్యోగ భృతికి చోటే లేదు.. నిరాశలో నిరుద్యోగులు
- సంక్షేమ రంగానికీ వెచ్చించింది అంతంత మాత్రమే



సూర్యాపేట, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ నిరాశను మిగిల్చింది. బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలకు అనేక అంచనాలు ఉండగా కేటాయింపులు సరిపడా లేకపోవడంతో పెదవి విరుస్తున్నారు. ప్రధానంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి సారి రూ.లక్ష కోట్లకు తగ్గకుండా బడ్జెట్‌లో కేటాయిస్తూ రైతాంగాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.19,746 కోట్లు కేటాయించింది. అందులో రూ.3వేల కోట్లు వేతనాలకు పోగా రూ.16వేల కోట్లు మాత్రమే మిగిలేవి. వాస్తవానికి ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.15వేల చొప్పున రైతు భరోసాకు రూ.22వేల కోట్లు, రూ.2 లక్షల రుణమాఫీ ద్వారా రూ.40 వేల కోట్లు, పంటలకు బోనస్ తదితరాలు కలిపి రూ.82వేల కోట్లు కావాల్సి ఉండగా కేటాయించింది మాత్రం రూ.16వేల కోట్లు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగం పట్ల ఉన్న ప్రేమ దీన్ని బట్టి అర్థమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. అలాగే కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామన్న మాట బడ్జెట్ ప్రసంగంలో కనిపించ లేదు. ఇక వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతామని గల్లీ నుంచి ఢిల్లీ లీడర్ల వరకు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. గ్యారెంటీలకు చట్టం కూడా చేస్తామని హామీ ఇచ్చారు. కానీ బడ్జెట్‌లో చట్టంపై చర్చ లేదు.

ఆరు గ్యారెంటీలకు దిశ లేదు

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పేరుతో గృహ జ్యోతి పథకం అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం దానికి కేవలం రూ.2,418 కోట్లు వెచ్చించింది. సూర్యాపేట జిల్లాలోనే 2,85,691 గృహాలు ఉండగా అన్నింటికీ 200 యూనిట్ల చొప్పున ఉచితంగా ఇచ్చేందుకు అయ్యే చార్జి వెయ్యి రూపాయలు. ఈ లెక్కన ఒక్క సూర్యాపేట జిల్లాకే నెలకు రూ. 285 కోట్లు, ఏడాదికి రూ.3,428 కోట్లు అవుతుంది. మరి బడ్జెట్‌లో ప్రతిపాదించిన 2,418 కోట్లతో ఈ పథకం ఎలా అమలు చేస్తారో ప్రశ్నార్థకంగా ఉంది. గృహ జ్యోతితోపాటు మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, యువ వికాసం తదితర పథకాలకు సూర్యాపేట జిల్లా వరకే లెక్కేసుకున్నా ఏటా దాదాపు రూ.28వేల కోట్లు అవసరం అవుతుండగా, ఈ బడ్జెట్‌లో పై పథకాలన్నింటికీ కలిపి రూ.53,196 కోట్లు కేటాయించారంటే అసలు ఈ బడ్జెట్‌ను ప్రజలు ఎలా నమ్మాలో అర్థం కావడం లేదు. సంక్షేమానికి కూడా కేటాయింపులు కనిపించడం లేదు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు మొత్తం కలిపి రూ.26వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దళితబంధు ఉంచుతారో, పేరు మార్చి వేరేది తెస్తారో లేక తీసేస్తారో తెలియని అయోమయం ఉంది. నిరుద్యోగులకు నెలకు రూ.3వేల చొప్పున ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తకపోవడం పట్ల నిరుద్యోగులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ఎన్‌హెచ్-65ని ఆరులైన్లుగా విస్తరించాలి

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 10 : కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలోని ఆయన నివాసంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ శనివారం కలిశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ 65ను మల్కాపూర్ నుంచి నందిగామ వరకు సూర్యాపేట మీదుగా ఆరు లైన్లు కలిగిన రోడ్డుగా వెంటనే విస్తరించాలని కోరారు. ప్రమాద హెచ్చరికలు కలిపి(బ్లాక్ స్పాట్ 17) మునుగోడు, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ వరకు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ధర్మోజిగూడెం నుంచి ఎల్లగిరి వరకు కొత్త సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్‌హెచ్ -65 మల్కాపూర్ నుంచి నందిగామ వరకు అండర్ పాస్‌లు, అలాగే జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు వెంట డ్రైనేజీని వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ అందిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించడం అంటే మన హక్కులను కోల్పోవడమే

- అనుభవం లేకుండా, సీనియర్ల సలహాలు తీసుకోకుండా సంతకాలు చేశారు
- కాంగ్రెస్ 60 ఏండ్ల విధ్వంస పాలనను పదేండ్లలో సరిచేసినం
- రైతాంగానికి జరిగే అన్యాయాన్ని ఎదురించేందుకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలి
- నల్లగొండ బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రవీంద్రసింగ్, చెరుకు సుధాకర్, పల్లె రవి కుమార్, తండు సైదులు గౌడ్ తదితరులు

నీలగిరి, ఫిబ్రవరి 10 : తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడింది నీళ్లు, నిధులు, నియామకాల కోసమమని, కృష్ణా నీటిలో మన వాటా తేల్చకుండా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం అంటే మన హక్కులను కోల్పోవడమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 13న నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ రోడ్‌లో జరుగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నల్లగొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ విధ్వంస పాలనను సరిచేస్తూ కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగిందన్నారు. కృష్ణా నీటిపై కేంద్రానికి అన్ని హక్కులు పోయి, ఆఖరికి మంచినీటిని కూడా మనం సొంతంగా వాడుకునే హక్కు ఉండదని తెలిపారు. ఇది తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. అనుభవం లేని ముఖ్యమంత్రి, మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, సీనియర్లు అనుభవజ్ఞుల సలహాలు తీసుకోకుండా కేఆర్ఎంబీ మీద సంతకాలు చేశారని విమర్శించారు. శాసన సభలో కూడా వాళ్లు మాట్లాడేది మాట్లాడి బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు అవకాశం లేకుండా చేస్తూ నిజాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ కోసం, తెలంగాణ హక్కుల కోసం కొట్లాడేది కేసీఆర్ మాత్రమేనని మరోసారి నిరూపితమయ్యిందని చెప్పారు. తమ బతుకులు బాగుపడతాయని ప్రజలు నమ్మి అధికారం అప్పగిస్తే ఆగం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. అనుభవ లేమి, ప్రతీకార ధోరణి, కక్షపూరిత పద్ధతుల్లో సాగిస్తున్న పరిపాలన వల్ల ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. తెలంగాణ హక్కులను ఇతరులకు తాకట్టు పెట్టే పద్ధతిలో వారి వ్యవహార శైలి సాగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల జరుగబోయే ప్రమాదాన్ని ప్రజలు, రైతులకు చెప్పాలనే నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ మూడు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి ఈ సభను నల్లగొండలో ఏర్పాటు చేస్తున్నందున, స్థానిక నాయకులు, రైతులు ఒక సవాలుగా స్వీకరించి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి, నల్లగొండ నియోజక వర్గం పార్టీ పరిశీలకుడు, వరంగల్ మాజీ మేయర్ రవీంద్ర సింగ్, మాజీ ఆర్ఓ శరణ్యారెడ్డి, కనగల్ ఎంపీపీ ఎస్కే కరీం పాషా, జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్, నల్లగొండ మాజీ ఎంపీపీ నారబోయిన భిక్షం, సింగిల్ విండో చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బకరం వెంకన్న, తిప్పర్తి, కనగల్, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షులు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్‌రావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు కమిటీలు అనుబంధ సంఘాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో కాంగ్రెస్ అసలు రూపం తేలింది

- అలీబాబా 40 దొంగల్లా వచ్చి పడ్డారు.. కేసీఆర్ తెచ్చిన పథకాలు కూడా అమలు చేసే పరిస్థితి లేదు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ పార్టీ పుట్టుక నుంచి మోసం చేయడమే నైజంగా అలవర్చుకుంది. గత ఎన్నికల ముందు అన్ని వర్గాలను మభ్యపెట్టి, మోసపూరిత మాటలతో అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చింది. నేడు హామీల అమలుకు బడ్జెట్‌లో కనీస కేటాయింపులు కూడా లేవు. ఇంతటి మోస పూరిత బడ్జెట్ చరిత్రలో లేదు. లంకెబిందెలున్నాయనుకొని వచ్చి అలీబాబా 40 దొంగల్లా వచ్చి పడ్డారు. వారు ఇచ్చిన హామీల సంగతి దేవుడెరుగు కనీసం గత సీఎం కేసీఆర్ ఇచ్చిన పథకాలను కూడా అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదు' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సూర్యాపేటలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కడ కూడా వారిచ్చిన హామీలపై చిత్తశుద్ధి లేదన్నారు. వాస్తవానికి కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని మా నాయకుడు కేసీఆర్ చెప్పడంతో ఆగామని, శాసన సభ సమావేశాల్లో గవర్నర్‌తో అన్నీ అబద్ధాలు చెప్పించారని, తాము కూడా చెప్పాల్సిన పద్ధతుల్లో ప్రజలకు వివరించామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రధానంగా రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని అడిగితే ఒక మంత్రి చెప్పుతో కొట్టాలని అనడంపై సభలో నిలదీశామని తెలిపారు. నిరుద్యోగ యువకులను భుజాలపై వేసుకొని, వారివి, వారి కుటుంబాల ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్, బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రస్తావన తీసుకురాలేదని, కొలువుల ప్రకటన లేదని, ఇంతకు మించిన ద్రోహం మరొకటి లేదని చెప్పారు. గృహ జ్యోతి పథకంతో 200 యూనిట్లు అందరికీ ఉచితం అని హామీ ఇచ్చి నేడు మోసం చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని మండిపడ్డారు. ఎంత మంది గృహ వినియోగదారులు ఉన్నారనేది కొత్తగా తెలుసుకోవాల్సిన అవసరం లేదని, విద్యుత్ శాఖకు నెలనెలా 200 యూనిట్లకు తీసేసి బిల్లు చెయ్యమంటే ఒక్కటే నిమిషంలో చేస్తారని చెప్పారు. ఈ పథకం కోసం రూ.2,300 కోట్లు మాత్రమే కేటాయించారని, కానీ ఇవి 50యూనిట్లు ఉచితం ఇచ్చేందుకు కూడా సరిపోవని తెలిపారు. అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మరిచిపోయిందని, బడ్జెట్‌లో దాని ఊసే లేదన్నారు. రైతు బంధు పేరు మార్చుతామన్నారని, రూ.10 వేలనుంచి 15వేల పెట్టుబడి అన్నారని, కానీ ఆ ప్రస్తావనే లేదని తెలిపారు. అన్ని పంటలకు రూ.500 బోనస్ అన్నారని, దాని ఊసే లేదని, మహిళలకు నెలనెలా రూ.2,500 బడ్జెట్‌లో కేటాయించలేదని అన్నారు. ఆటో కార్మికులను ఆదుకునేందుకు ఏటా 12వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో పొందుపర్చలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వంద కాదు వేల రోజుల్లో కూడా పూర్తికావని, తెలంగాణ ప్రజలకు వీళ్ల అసలు రూపం తెలిసిందని అన్నారు. జనం జాగ్రత్తగా ఉండాలి, ఓటేయించుకున్న వారిని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ప్రభుత్వ విప్ బొడకుంట్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, బాలమల్లు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విస్మరణ



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాలను విస్మరించినట్లుగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీల అమలుపై ఉన్న చిత్తశుద్ధి మిగిలిన సమస్యలపై కనిపించలేదు. రుణమాఫీ, రైతుబంధు, రైతు భరోసా ఎప్పటి వరకు ఏ రకంగా అమలు చేస్తారో నిర్దిష్టంగా పేర్కొనలేదు. గతంలో మహిళా పొదుపు సంఘాలకు మ్యాచిం గ్ గ్రాంట్‌తోపాటు పావలా వడ్డీ రుణాలు ఎప్పటి వరకు ఇస్తారో కూడా తెలుపలేదు. ముఖ్యంగా సాగునీటి రంగంలో పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం సొరంగం మార్గాన్ని పూర్తి చేసేందుకు ఎక్కువ నిధులు కేటాయించి ఖర్చు చేయాలి. నియోజకవర్గానికి 3,500 గృహ నిర్మాణాలు చేపడితే ఇండ్లు లేని నిరుపేదల వరకు ఎప్పటి వరకు పూర్తవుతాయి. మొత్తంగా బడ్జెట్‌ను పరిశీలిస్తే రాబడికి పోబడికి తేడా ఉంది. ఖర్చులకు తగ్గట్లుగా ఆదాయం ఏరకంగా సమకూర్చుకుంటారో చెప్పలేదు.

-ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి

పోటాపోటీగా రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు శనివారం రెండోరోజు కొనసాగాయి. 14 లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. రెండు రోజుల నుంచి నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లకు ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేయనున్నారు.

డీపీఆర్వోగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



నీలగిరి, ఫిబ్రవరి 10 : నల్లగొండ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. డీపీఆర్ఓగా ఉన్న శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ హరి చందన దాసరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

దేవరకొండ : బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

కాంగ్రెస్ చేతగానితనం వల్లే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు

- 13న బీఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 10 : శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగించడం వల్ల నల్లగొండకు తీవ్ర నష్టం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత జరిగిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. దేవరకొండలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన చలో నల్లగొండ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల పంపిణీని కేఆర్ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించడం వల్ల ఎడమకాల్వ రైతాంగం మళ్లీ తిరోగమనం అయ్యేలా పరిస్థితి వచ్చిందని వాపోయారు. 2021లో కేంద్రం గెజిట్ ఇచ్చి ఒత్తిడి తీసుకొచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు అప్పగించేందుకు ఒప్పుకోలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా కేసీఆర్ ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చారని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు గడువక ముందే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది ఎవరో దీనితోనే స్పష్టమవుతున్నదని అన్నారు.

మేధావులు మౌనం వీడాలి

రాష్ట్ర ప్రయోజనాల కోసం మేధావులు మౌనం వీడాలని, ప్రజలు అన్ని విషయాలు అర్థం చేసుకోవాలని రవీంద్ర కుమార్ కోరారు. బోర్డు అనుమతి లేనిదే రాష్ట్ర ఇంజినీర్లు, అధికారులు ప్రాజెక్టు వద్దకు వెళ్లే పరిస్థితి ఉండదని తెలిపారు. బోర్డు అనుమతి లేనిదే విద్యుత్ చేయడం సాధ్యం కాదన్నారు. చలో నల్లగొండ సభకు నియోజక వర్గం నుంచి పదివేల మందికి పైగా బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో బహిరంగ సభ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యానాయక్ వడిత్యా రమేశ్, హన్మంత్ వెంకటేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు ముక్కమళ్ల బాలయ్య, తూం నాగార్జున్‌రెడ్డి, మాధవరం శ్రీనివాస్‌రావు, జడ్పీటీసీ సలహాదారులు మారుపాకుల సురేశ్ గౌడ్, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు టీవీఎన్‌రెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ముత్యాల సర్వయ్య, లోకసాని తిరుపతయ్య, వెల్గూరి వల్లపురెడ్డి, రాజినేని వెంకటేశ్వర్‌రావు, ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, ఏర్పుల గోవింద్ యాదవ్, దొందేటి మల్లారెడ్డి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, గోపిడి కృష్ణారెడ్డి, యాసాని రాజవర్ధన్‌రెడ్డి, మాస భాస్కర్, రమావత్ మోహన కృష్ణ, ఉజ్జిని నరేందర్‌రావు, పేర్వాల జంగారెడ్డి, మాధవరం జనార్దన్‌రావు, రమావత్ రమేశ్, ఆరెకంటి రాములు, మునగాల అంజిరెడ్డి, రేటినేని ముత్యపురావు, కేతావత్ శంకర్ నాయక్, గోసుల అనంతగిరి, భగవంతరావు, వేముల రాజు, ఎర్రకృష్ణ, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

చలో నల్లగొండ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్‌లో చలో నల్లగొండ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, చంటి క్రాంతికిరణ్

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 10 : కృష్ణా జలాల పరిరక్షణకు ఈ నెల 13న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చంటి క్రాంతికిరణ్ కోరారు. హుజూర్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల కృష్ణాజలాలు కేంద్ర పరిధిలోకి వెళ్లాయన్నారు. వాటిని సాధించుకునేందుకు సాగర్ ఆయకట్టు రైతాంగం పోరుబాట పట్టే సమయం ఆసన్నమైందని తెలిపారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, ఏడు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, పక్కన మాజీ ఎమ్మెల్యే జాజుల నరేందర్

నీటివాటాలో అన్యాయాన్ని ఎండ గట్టేందుకే కేసీఆర్ సభ

- మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, జాజుల నరేందర్

త్రిపురారం, ఫిబ్రవరి 10 : ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, జాజుల నరేందర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడాన్ని నిరసిస్తూ, ప్రజలకు వాస్తవాలను తెలియచేయడం కోసం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బహునూతల నరేందర్, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పామోజు వెంకటాచారి, మాధ ధనలక్ష్మీవెంకటేశ్వర్లు, ఎస్‌కే.దస్తగిరి, అవిరెండ్ల సైదులు, జంగిలి శ్రీనివాస్, కామర్ల జానయ్య, మద్దూరు శ్రీనివాస్, రాజారాంసింగ్, మట్టయ్య, సుశీల్‌నాయక్, చింతకాయల యాదయ్య, సయ్యద్, అవిరెండ్ల పండు, శ్రీకాంత్, వినోద్, నాగయ్య, వెంకన్న, వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చలో నల్లగొండ సభను విజయవంతం చేయాలని పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

నీళ్ల ధోకాపై ఉద్యమనేత కేసీఆర్ మరోసారి పోరాటం

- 13న బహిరంగ సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే బొల్లం, నియోజకవర్గ ఇన్‌చార్జి తక్కెళ్లపల్లి

కోదాడ, ఫిబ్రవరి 13 : కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నదని, మన హక్కులను సాధించుకునేందుకు ఈ నెల 13న నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. కోదాడ బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం సభ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఉద్యమ సమయంలో సాగర్ నీటి విడుదలలో అన్యాయంపై కేసీఆర్ పోరాటం చేశారని, అదే తరహాలతో పోరాటానికి రైతాంగం సిద్ధం కావాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు తాము చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే కేఆర్ఎంబీ ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శీలం సైదులు, పచ్చిపాల వేణుయాదవ్, రమేశ్, బెజవాడ శ్రావణ్ పాల్గొన్నారు.

కట్టంగూర్ ఎఫ్‌పీఓలో నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరి చందన

పంట సాగులో సాంకేతికను ఉపయోగించుకోవాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

కట్టంగూర్, ఫిబ్రవరి 10 : రైతులు సంఘటితంగా ఏర్పడి పంటల సాగులో సాంకేతికతను ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామ పరిధి గంగాదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని శనివారం ఆమె అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో కలిసి సందర్శించారు. సంఘం నిర్వాహకులు నిమ్మ స్టోరేజీ యూనిట్, ప్రాసెసింగ్ యూనిట్, సోలార్ డయ్యర్ల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయలు, పండ్ల వ్యర్థాలతో ఎరువు తయారీపై దృష్టి పెట్టాలనాన్నారు. సన్న, చిన్న కారు రైతులు సమస్యలను పరిష్కరించుకునేదుకు సంఘటితంగా ఎఫ్‌పీఓను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి సంగీత లక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కాళిందిని, నాబార్డు జిల్లా మేనేజర్ వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్, ఎంపీడీఓ పోరెళ్ల సునీత, తాసీల్దార్ దొంకెన స్వప్న, ఎంపీఓ మహ్మద్ అథర్ పర్వేజ్, వ్యవసాయ అధికారులు, శ్రీనివాస్, గిరిప్రసాద్, జామియా, ఆర్ఐ సిరిగిరెడ్డి కుమార్‌రెడ్డి, ఏపీఓ కడెం రాంమోహన్, ఏపీఎం చౌగోని వినోద, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, ఐఆర్‌డీఎస్ చైర్మన్ రమేశ్ పాల్గొన్నారు.